సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 6 । జూలై । 2025



నేడు మొహర్రం
జిల్లాలో కులమతాలకు అతీతంగా మొహర్రం వేడుకలు జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. 8లో



తొలి పండుగకు సిద్ధం
ఎంతో విశిష్టత కలిగిన తొలి ఏకాదశి పండుగను జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరుపుకోనున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం
జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశంలో దట్టమైన మేఘాలు అలుముకునే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

కొత్తగూడెంఅర్బన్ : రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం కొత్తగూడెంలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు కొత్తగూడెం క్లబ్‌లో జరిగే కార్యక్రమంలో చుంచుపల్లి, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాల ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేయనున్నారు. చుంచుపల్లి మండలం ఎస్‌ఆర్‌టీ, మాయాబజార్, వనమా కాలనీ నిర్వాసితులకు ఇంటి స్థలాల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం – రూప్లా తండా హైలెవల్ బ్రిడ్జి పనులకు, ఒంటి గంటకు చింతపెంటిగూడెంలో బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం పాల్వంచలో జరిగే పలు ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరవుతారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు పాల్గొననున్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి



షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ విద్యాచందన సూచించారు. శనివారం ఆమె మండలంలోని రొంపేడులో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ నెలకొల్పేందుకు స్థల పరిశీలన చేశారు. కొమ్ముగూడెం గ్రామపంచాయతీ నాయకులగూడెం గ్రామంలో పౌల్ట్రీ మదర్ యూనిట్ నిర్మాణ పనులను, బొజ్జాయిగూడెం గ్రామంలో కమ్యూనిటీ టాయిలెట్స్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎంపీడీవో ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, ఏపీఎం దుర్గారావు పాల్గొన్నారు.

జనన ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లా విద్యాశాఖ ఇచ్చిన ఫార్మాట్లలో జనన ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పాఠశాలల్లో చదువుతున్న 4,369 మంది విద్యార్థులకు ఆధార్ కార్డులు లేవని మండల విద్యాధికారులు నివేదిక ఇచ్చారని తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆధార్ కార్డుల జారీకి ముందుగా జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఆర్డీఓలకు సూచనలు చేశారని వివరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాల్లో జనన ధ్రువీకరణ పత్రాలు పొందాలని, ఆ తర్వాత పాఠశాలల్లో, ఎంఈఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఆధార్ కార్డు పొందాలని వివరించారు. తహసీల్దార్ నుంచి పొందిన రెసిడెన్స్ సర్టిఫికెట్ ద్వారా ఆధార్ కార్డుల్లో మార్పులు చేర్పులు కూడా చేసుకోవాలని తెలిపారు. ఏ ఒక్క విద్యార్థి పేరు కూడా ఆధార్ లేని కారణంగా యూడైస్ వెబ్‌సైట్‌లో నమోదు చేయకుండా ఉండొద్దని మండల విద్యాధికారులకు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర బాధ్యుడు తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

సింగరేణి(కొత్తగూడెం): దేశ రక్షణ కోసం జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర బాధ్యుడు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. శనివారం మంచికంటి భవన్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాసంఘాల పోరాట వేదిక జిల్లా సదస్సులో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సార్వత్రిక సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరల చట్టం తేవాలని డిమాండ్ చేశారు. నాయకులు పోతినేని సుదర్శన్, మధు, యలమంచిలి రవికుమార్, మచ్చా వెంకటేశ్వర్లు, రేపాకుల శ్రీనివాస్, అన్నవరకు కనకయ్య, వంశీకృష్ణ, బ్రహ్మాచారి, కే.పుల్లయ్య, ఎండీ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం నగరంలోని ఓ థియేటర్



సండే స్పెషల్

తెర ఒక్కటే.. సినిమాలు రెండు

సామాన్యుడి నుంచి వీఐపీల వరకు వినోద సాధనం సినిమాలే. అందుకే పల్లె, పట్నం తేడా లేకుండా సినిమా హాళ్లు అందుబాటులోకి వచ్చాయి. గతంలో రోజుకు మూడు ఆటలతో సినిమాలు నడిచేవి. 80వ దశకం చివరి నుంచి మార్నింగ్ షో, మ్యాట్నీ, ఫస్ట్ షో, సెకండ్ షో అంటూ నాలుగు షోలు వేసేవారు. ఇక స్టార్ హీరోల సినిమాలయితే బెనిఫిట్‌షో, ఎర్లీ మార్నింగ్ షోలు అదనంగా ప్రదర్శించేవారు. ఇవి కాకుండా గంట, గంటన్నర నిడివి ఉండే బ్రూస్‌లీ, జాకీచాన్, జెట్‌లీ లాంటి చైనీస్ హీరోల యాక్షన్ సినిమాలు, ఏ సర్టిఫికెట్ సినిమాలు నూన్ షో పేరుతో థియేటర్లలో ప్రత్యేకంగా ఆడించేవారు. ఏ షో ప్రేక్షకులు ఆ షోలకు ఉండేవారు. గ్రామాల నుంచి పట్టణాలకు వచ్చే వారు ఎక్కువగా మార్నింగ్, మ్యాట్నీషోలకు వెళితే, టౌన్లలో ఉండేవారు, ఉద్యోగులు ఫస్ట్‌షో, సెకండ్‌షోలను ఎంచుకునే వారు. కుర్రకారుకు నూన్‌షోలు ఫేవరేట్‌గా ఉండేవి.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



ఒకప్పుడు థియేటర్‌లో ఒకే సినిమా నాలుగు ఆటలు

- మల్టీప్లెక్స్‌ల రాకతో మారిన ప్రదర్శన విధానం
- సింగిల్ స్క్రీన్లలోనూ సింగిల్ సినిమాలకు తగ్గిన క్రేజ్
- ట్రెండ్‌కు తగ్గట్టు ప్రతీ పూట వేర్వేరు చిత్రాల ప్రదర్శన

మరింత సౌకర్యవంతంగా మల్టీప్లెక్స్‌లు..
ఇళ్లలోకి టీవీలు వచ్చాక థియేటర్ల కథ ముగుస్తుందనే ప్రచారం జరిగింది. థియేటర్ ఎక్స్‌పీరియన్స్ పేరుతో డాల్బీ డిజిటల్, డిజిటల్ ట్రాక్ సౌండ్ (డీటీఎస్), డాల్బీ అట్మోస్ పేరుతో సౌండ్ క్వాలిటీ, కుషన్, కపుల్ చైర్స్ వంటి సౌకర్యాలతో ఏసీ హాళ్లు వచ్చాయి. దీంతో ఎంటర్‌టైన్‌మెంట్‌లో థియేటర్లు మరింత అగ్రస్థానానికి చేరుకున్నాయి. ఇదే క్రమంలో మరింత సౌకర్యవంతంగా మల్టీప్లెక్స్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఒకే ప్రాంగణంలో రెండుకు మించి స్క్రీన్లు, మూడుకు పైగా సినిమాలు ప్రదర్శించడం మొదలైంది. టాయిలెట్స్ మొదలు స్క్రీన్ వరకు అన్నింటా బెస్ట్ సర్వీస్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తూ సినిమాకు సరికొత్త కేరాఫ్ అడ్రెస్‌గా మల్టీప్లెక్స్‌లు నిలిచాయి.

ఓటీటీల రాకతో..
కరోనా సమయంలో విధించిన లాక్‌డౌన్ సినిమా థియేటర్ల పాలిట మృత్యుపాశంగా మారింది. ఓ వైపు మల్టీప్లెక్స్ హవా పెరుగుతుంటే మరోవైపు ఓవర్ ది టాప్ (ఓటీటీ) యాప్‌లు ఇబ్బడిముబ్బడిగా అందుబాటులోకి వచ్చాయి. రీజినల్, ఇంటర్నేషనల్ కంటెంట్ లోకల్ లాంగ్వేజ్‌లో అందుబాటులోకి వచ్చింది. దీంతో వినోద రంగంలో థియేటర్లకు గట్టి ప్రత్యామ్నాయం అందుబాటులోకి వచ్చినట్లయింది. ప్రేక్షకుడిని ఇంటి నుంచి థియేటర్‌కు రప్పించాలంటే స్టార్ పవర్ లేదంటే మంచి కంటెంట్ ఉండక తప్పని పరిస్థితి ఎదురైంది.

థియేటర్ల మూసివేత
గతంతో పోల్చితే స్టార్‌డమ్ ఉన్న నటుల నుంచి వచ్చే సినిమాల తగ్గిపోవడం, ఓటీటీలో మంచి కంటెంట్ వస్తుండటంతో థియేటర్‌కు వచ్చే ప్రేక్షకుల సంఖ్య తగ్గిపోతోంది. ఫలితంగా థియేటర్లు మూసేయాల్సిన పరిస్థితి ఎదురైంది. శుక్రవారం సినిమా విడుదలైతే సోమవారం నుంచి ప్రేక్షకుల సంఖ్య తక్కువగా ఉండటంతో షోలు క్యాన్సిల్ చేయడం రివాజుగా మారింది. కొన్ని థియేటర్లయితే క్రేజ్ ఉన్న సినిమా విడుదలైనప్పుడు తెరవడం, ఆ తర్వాత మూత వేయడం చేస్తున్నారు. తెలంగాణలో సినిమా ప్రదర్శనలకు గుండెకాయలా ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో థియేటర్లు మూతపడిపోవడం మొదలైంది. ఒకప్పుడు ఖమ్మంలో పదకొండు థియేటర్లు ఉంటే ఇప్పుడు కేవలం ఐదే మిగిలాయి. కొత్తగూడెంలో ఏడుకు బదులు నాలుగు, పాల్వంచలో నాలిగింటా రెండు, ఇల్లెందులో మూడు, మణుగూరు, భద్రాచలంలలో మూడింటా రెండు థియేటర్లే నడుస్తున్నాయి. ఇక మండల కేంద్రాల్లోని థియేటర్లు ఎప్పుడో మూతపడ్డాయి.

ఒకే రోజు రెండు, మూడు సినిమాలు..
మారిన పరిస్థితులకు తగ్గట్టుగా సింగిల్ స్క్రీన్ థియేటర్లు తమ పంథాను మార్చుకోక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒకప్పుడు సింగిల్ స్క్రీన్లలో నాలుగు షోలలో ఒకే సినిమా నడిపించడగా ఇప్పుడు ఒకే రోజు రెండు, మూడు సినిమాలు నడిపించే పద్ధతిని అమల్లోకి తెస్తున్నారు. సినిమాలో ఉండే కంటెంట్, వచ్చే ప్రేక్షకులను బట్టి షోలు ఏర్పాటు చేస్తున్నారు. శనివారం ఖమ్మం వినోద థియేటర్‌లో హాలీవుడ్ చిత్రం జురాసిక్‌పార్క్ తెలుగు డబ్బింగ్ వెర్షన్ మార్నింగ్, మ్యాట్నీ షోలు ఉండగా ఫస్ట్ షో, సెకండ్ షోలలో ఇంగ్లిష్ వెర్షన్ ప్రదర్శించారు. ఇదే సినిమా కొత్తగూడెం ఏషియన్ మహేశ్వరి, భద్రాచలం విజయ్‌భాస్కర్‌లలో మ్యాట్నీ, సెకండ్‌షోలు ఉండగా మిగిలిన షోలలో కన్నప్ప, కుబేరా సినిమాలు ఆడిస్తున్నారు. ఈ ట్రెండ్ ఆర్నెళ్ల క్రితమే మొదలైనా పాపులారిటీ ఉన్న సినిమాలు ఇలా ఆడకపోవడంతో ఈ అంశం వెలుగులోకి రాలేదు. కానీ ఇప్పుడు ఒకేసారి వేర్వేరు సినిమాలు ప్రేక్షకుల ఆదరణ చూరగొనడంతో ఒకే థియేటర్‌లో వేర్వేరు షోలకు వేర్వేరు సినిమాలు ప్రదర్శించే అవకాశం చిక్కింది. ట్రెండ్‌కు తగ్గట్టు సింగిల్ స్క్రీన్‌లే మల్టీప్లెక్స్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేందుకు సిద్ధమయ్యాయి.

తాలిపేరుకు వరద ఉధృతి

రెండు గేట్లు ఎత్తి రెండు వేల క్యూసెక్కులు దిగువకు విడుదల



తాలిపేరు ప్రాజెక్ట్ నుంచి విడుదలవుతున్న నీరు

చర్ల: తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్ట్‌కు వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువ ప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తుండటంతో రెండు రోజుల నుంచి ప్రాజెక్ట్‌లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. శనివారం ప్రాజెక్ట్ 25 గేట్లలో రెండు గేట్లను 2 అడుగుల మేర ఎత్తి ఉంచి 2,105 క్యూసెక్కుల చొప్పున వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని దృష్టిలో ఉంచుకుని నీటిమట్టాన్ని 71.74 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నారు. పంట పొలాలకు సాగునీటిని విడుదల చేసేందుకు సరిపడా నీరు ప్రాజెక్ట్‌లో ఉందని డీఈ తిరుపతి తెలిపారు.

నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలి



మాట్లాడుతున్న ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ మధుసూదన్

పాల్వంచ: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్(ఆపరేషన్స్) టి.మధుసూదన్ అన్నారు. శనివారం జెన్‌కో ట్రెనింగ్ సెంటర్‌లో విద్యుత్ సరఫరా అంతరాయాలపై జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. నూతనంగా నిర్మాణం చేపడుతున్న విద్యుత్ నియంత్రికలు, విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్‌లు, విద్యుత్ ప్రమాదాల నివారణ, విద్యుత్ ప్రమాదాలపై అవగాహన తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది పూర్తి రక్షణ పరికరాలు వాడాలని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఆదేశించారు. అనంతరం డైరెక్టర్‌ను అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ రాజు చౌహాన్, జిల్లా సూపరింటెండెంట్ మహేందర్, డీఈలు, ఏడీఈలు, అకౌంట్స్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లినికల్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: మార్చి–2019 నుంచి ఇంటర్మీడియట్ ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ ఒకేషనల్ కోర్సు ఉత్తీర్ణులైన విద్యార్థులు ఏడాది క్లినికల్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి హెచ్.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రి, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు, పాల్వంచ, బూర్గంపాడు, అశ్వారావుపేట, చర్లలోని టీవీవీపీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో శిక్షణ ఇస్తామని, ఎంపికైన విద్యార్థులు రూ.1000 డీడీ చెల్లించాలని వివరించారు. గతంలో దరఖాస్తు చేసుకుని ఎంపికకాని వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు.

'ఉద్యానం' సతమతం!

- జిల్లా ఉద్యాన శాఖలో ఖాళీ పోస్టులు
- ఉన్న అధికారులపై పెరుగుతున్న పనిభారం
- కనీసం కార్యాలయాలు కూడా లేని దుస్థితి



సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా ఉద్యాన శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. కలెక్టరేట్‌లోని ఉద్యాన శాఖ కార్యాలయం తప్ప జిల్లాలో మరెక్కడా ఉద్యానశాఖకు కనీసం కార్యాలయాలు లేవు. దీంతో అధికారులు రైతు వేదికల నుంచే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. గతంలో జిల్లా ఉద్యాన శాఖాధికారిగా పనిచేసిన అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయాడు. కొంతకాలం తర్వాత ఆ స్థానంలో జంగా కిషోర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. ప్రస్తుతం జిల్లా ఆయిల్‌పామ్ సాగులో రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉంది. మరో వైపు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ చొరవతో కొందరు రైతులు లాభదాయకమైన మునగసాగుపై దృష్టి సారిస్తున్నారు. సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా పండ్లు, కూరగాయల సాగు చేపడితే ఆదాయం పెరుగుతుందని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. కానీ వీటిపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే ఉద్యాన శాఖాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

జిల్లాలో ఆరుగురు హార్టికల్చర్ ఆఫీసర్లు
జిల్లా కేంద్రంలోని ఉద్యాన శాఖ కార్యాలయంలో టెక్నికల్ హార్టికల్చర్ ఆఫీసర్ ఒకరు ఉండగా, అశ్వారావుపేట, అశ్వాపురం, దమ్మపేట, ఇల్లెందు, పాల్వంచ కేంద్రాల్లో మరో ఐదుగురు హార్టికల్చర్ అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. అశ్వారావుపేట హార్టికల్చర్ ఆఫీసర్ పరిధిలో ములకలపల్లి, భద్రాచలం, బూర్గంపాడు మండలాలు, దమ్మపేట ఆఫీసర్ పరిధిలో అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, అశ్వాపురం ఆఫీసర్ పరిధిలో పినపాక, చర్ల, దుమ్ముగూడెం, కరకగూడెం, మణుగూరు, ఇల్లెందు ఆఫీసర్ పరిధిలో ఆళ్లపల్లి, గుండాల, టేకులపల్లి, పాల్వంచ ఆఫీసర్ పరిధిలో జూలూరుపాడు, సుజాతనగర్, కొత్తగూడెం, చుంచుపల్లి మండలాలు ఉన్నాయి.

రైతు వేదికలే కార్యాలయాలు
హార్టికల్చర్ ఆఫీసర్లకు ఎక్కడా కార్యాలయాలు లేవు. జిల్లాలో వ్యవసాయశాఖకు అనుబంధంగా 67 రైతువేదికలు ఉన్నాయి. వీటి నుంచే అధికారులు శాఖాపరమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వ్యవసాయశాఖ కార్యకలాపాలు ఉన్నపుడు ఉద్యానశాఖకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శాఖాపరమైన విధులతోపాటు ఇతర ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, ఎన్నికల విధులు, సర్వే వంటి పనులు, వరద సహాయక కార్యక్రమాలు తదితర బాధ్యతలు కూడా కేటాయిస్తుండటంతో ఉద్యాన అధికారులు పనిభారంతో సతమతమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఎక్స్‌టెన్షన్ అధికారులే లేరు
ప్రతీ హార్టికల్చర్ ఆఫీసర్‌కు ఇద్దరు ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు సహాయకులుగా ఉండాలి. జిల్లాలో 12 మంది టెక్నికల్ ఆఫీసర్లను ఉండాల్సి ఉండగా, అన్ని పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. దీంతో ఉన్న అధికారులపైనే పనిభారం పడుతోంది. జిల్లాలో 2019 వరకు ఎనిమిది మంది ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు విధులను నిర్వహించారు. వారు ఇతర ప్రాంతాలకు బదిలీ కావడంతో అప్పటి నుంచి ఆ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



ఉద్యాన శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం. ఉన్న అధికారులతోనే రైతులకు అవసరమైన సేవలు అందిస్తున్నాం. ఉద్యాన శాఖ నుంచి వివిధ పంటలకు ఇస్తున్న రాయితీలపై అవగాహన కల్పిస్తున్నాం.

– జంగా కిషోర్, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖాధికారి

క్లుప్తంగా

బీఏఎస్‌కు విద్యార్థుల ఎంపిక

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఖమ్మం జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాల (బీఏఎస్)ల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి గత నెల 20వ తేదీన లక్కీ డ్రా ద్వారా విద్యార్థినులను ఎంపిక చేయగా పలువురు చేరలేదు. దీంతో కొత్త వారి ఎంపికకు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో శనివారం గిరిజన సంక్షేమ శాఖ ఖమ్మం డీడీ విజయలక్ష్మి ఆధ్వర్యాన డ్రా తీశారు. అధికారులు హరీశ్, అశోక్‌కుమార్, నారాయణరెడ్డి, రాములు, రాంబాబు, రాజేందర్, నర్సింహారావు, శ్రీనివాసరావు, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఎదగాలి


ట్రెయినీ కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఆర్పీలు

కొత్తగూడెంఅర్బన్: మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతోందని ట్రెయినీ కలెక్టర్ సౌరబ్‌శర్మ అన్నారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ఆర్పీల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెప్మా డీఎంసీ, ఏడీఎంసీ, టీఎంసీ బి.వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు శాంతకుమార్, మౌలాల్, సరిత, ఆర్పీలు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక చేయూత

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంకు చెందిన సింధు కేన్సర్‌తో బాధపడుతుండగా చికిత్సకు వసుధ ఫౌండేషన్ బాధ్యులు చేయూతనిచ్చారు. కొత్తగూడెంలో శనివారం ఎస్పీ రోహిత్‌రాజు చేతుల మీదుగా రూ.10 వేల చెక్కు అందజేశారు. ఫౌండేషన్ కన్వీనర్ విగేశ్న శ్రీనివాసరాజు, రమేష్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం (జీఎల్‌బీకేఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెంలోని రైటర్ బస్తీలో జరిగిన విప్లవ కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మె విజయవంతం ద్వారా కేంద్రానికి కనువిప్పు కలిగించాలని కోరారు. నాయకులు గౌనీ నాగేశ్వరరావు, ఎన్. సంజీవ్, మ ల్లీఖార్జున్ రావు, శ్రీను, కృష్ణ, శరత్, రామకృష్ణ, రాజేష్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

10న తెలంగాణ జాగృతి సమావేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ జాగృతి జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశాన్ని కొత్తగూడెం క్లబ్‌లో ఈనెల 10న నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెంలో శనివారం జరిగిన సన్నాహక సమావేశంలో జాగృతి రాష్ట్ర నాయకుడు రూప్‌సింగ్, సదానందంగౌడ్, మహిళా అధ్యక్షురాలు మాధవి మాట్లాడారు. ఈనెల 10న జరిగే సమావేశానికి తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హాజరుకానుండగా, సీఐటీయూ పట్టణ కార్యదర్శి వీరన్న నేతృత్వంలో పలువురు జాగృతిలో చేరనున్నారని తెలిపారు. జిల్లా కన్వీనర్ పవన్‌నాయక్, నాయకులు సింధుతపస్వి, బత్తుల వీరయ్య, ఎం.డీ.హుస్సేన్, నవతన్, కిరణ్‌కుమార్, వరప్రసాద్, సాదిక్‌పాషా పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

తొలి పండగకు సిద్ధం..

నేడు తొలి ఏకాదశి

- హిందువులకు మొదటి పండుగగా పేరు
- ముస్తాబైన వైష్ణవ ఆలయాలు
- ఉపవాసాలు, దానధర్మాలతో మోక్షం



కొత్తగూడెంటౌన్: హిందువులకు ఎంతో విశిష్టమైన పండగలో మొదటి పండగ తొలి ఏకాదశి. ఆషాఢమాసంలో వచ్చే ఈ పండగను దేవశయన ఏకాదశి లేదా పేలాల పండగ అని కూడా పిలుస్తారు. ఆషాఢశుద్ధ ఏకదశి తిథి సందర్భంగా నేడు(ఆదివారం) పండగను జరుపుకుంటారని అర్చకులు, వేదపండితులు చెబుతున్నారు.

తొలి ఏకాదశితో పండగలు మొదలు..

గ్రీష్మ రుతువు ముగిసి, వర్ష రుతువు ప్రారంభమైన సందర్భంగా పండగను జరుపుకోవడం ఆనవాయితీ. తొలి ఏకాదశికి హైందవ సంస్కృతిలో ప్రత్యేక స్థానం ఉంది. ఇది శ్రీమహావిష్ణువు, లక్ష్మీదేవిలకు ఇష్టమైన పండగ కావడంతో అందరూ నేడు పూజలు చేస్తే పాపాలు తొలగిపోతాయని, పుణ్యఫలం లభిస్తుందని భక్తుల నమ్మకం.

ఏడాది కాలంలో వచ్చే 24 ఏకాదశుల్లో ఇది మొదటిది కాగా తెలుగు పండగలన్నీ దీంతోనే ప్రారంభమవుతాయి. శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో యోగనిద్రలోకి వెళ్లి నాలుగు నెలల పాటు విశ్రాంతి తీసుకుంటారని చెబుతారు. ఇక సూర్యుడు దక్షిణం వైపుకు మరలిన తరుణాన ఈ రోజు నుంచి దక్షిణయానం ప్రారంభమవుతుందని, ఈ సందర్భంగా గోపద్మవ్రతాన్ని కార్తీకమాస శుక్లపక్షం వరకు జరుపుకుంటారు. ఇందుకోసం శ్రీవైష్ణవి ఆలయాలను నిర్వాహకులు ముస్తాబుచేయడంతో పాటు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనం కోసం ఏర్పాట్లు చేశారు.

విశిష్ట పూజలు.

ఏకాదశి రోజున కొందరు చతుర్మాస వ్రతాలు ప్రారంభిస్తారు. సూర్యోదయానికి ముందే శ్రీహరిని పూజించి, విష్ణువు ప్రతిమను పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి చక్కెర పొంగళి నైవేద్యంగా పెడతారు. అంతేకాక కర్పూర హారతులిచ్చి భక్తులు ఉపవాసంతో వైష్ణవ ఆలయాలను సందర్శించి పూజలు చేస్తారు. గోపూజ చేయడం మంచిదని, పితృ దేవతలకు ప్రీతికరమైన పేలాల పిండిని తినాలని పెద్దలు, అర్చకులు చెబుతున్నారు. ఉపవాసం ఉండి దానధర్మాలు చేస్తేమోక్షం సిద్ధిస్తుందని పేర్కొంటున్నారు.

మొదటి పండగ..



తొలి ఏకాదశి శ్రీమహావిష్ణువు, లక్ష్మీదేవిలకు ఇష్టమైన పండగ కావడంతో ఈ రోజు పూజలు చేస్తే పాపాలు తొలగిపోతాయి. పుణ్యఫలం లభిస్తుంది. ఉపవాసం ఉండి దానధర్మాలు చేస్తే మోక్షం సిద్ధిస్తుంది.

– శ్రీధరాచార్యులు, రామవరం శివాలయం అర్చకుడు

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక


సేకరించిన విత్తనాలతో ఉపాధ్యాయులు

ఇల్లెందు: విత్తనాలు సేకరించాలని ఇటీవల జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ విద్యార్థులకు చాలెంజ్ విసరడంతో మండలంలోని ముత్తారపు కట్ట ఎంపీపీఎస్ స్కూల్ విద్యార్థులు 120 రకాల విత్తనాలు సేకరించి మండల స్థాయి విజేతలుగా నిలిచారు. శనివారం ఇల్లెందు మండలస్థాయి విత్తన సేకరణ చాలెంజ్ ప్రదర్శన పట్టణంలోని జేబీఎస్ హైస్కూల్‌లో నిర్వహించారు. శుక్రవారం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో జరిగిన పోటీల్లో గర్ల్స్ హైస్కూల్, జేబీఎస్, 21 ఫిట్ జెడ్పీ హైస్కూల్, మెయిన్ రోడ్ హైస్కూల్, చల్లసముద్రం, కొమరారం, సుభాష్‌నగర్‌ల పరిధి నుంచి ఒక్కో స్కూల్ నుంచి పోటీల్లో పాల్గొనగా.. ముత్తారపు కట్ట ఎంపీపీఎస్ జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ఎంఈఓ ఉమాశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆ స్కూల్ హెచ్ఎం కబ్బాకుల రవి, టీచర్ ఆరెం రవికుమార్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు లలిత, అరుణ్‌కుమార్, లాలు, కల్పన, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల పట్టివేత


చోరీకి గురైన బ్యాగు

భద్రాచలం అర్బన్: భద్రాచలం పట్టణంలోని గోదావరి కరకట్ట ప్రాంతంలో శనివారం సాయంత్రం రూ.లక్ష విలువ గల సామగ్రి ఉన్న బ్యాగును అపహరిస్తున్న ఇద్దరు వ్యక్తులను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివరాలిలా.. కరకట్ట ప్రాంతంలో ఫొటోలు తీసేందుకు అవసరమైన కెమెరా ఇతర సామగ్రి ఉన్న ఒక బ్యాగును ఇద్దరు వ్యక్తులు అపహరించే ప్రయత్నం చేయగా స్థానికులు పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో బ్లూకోల్ట్ టీం అక్కడకు చేరుకొని వారిని స్టేషన్‌కు తరలించి విచారించగా.. పాల్వంచ పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన చలపతి, ఉపేంద్రగా తెలిసింది.

వృద్ధురాలిని కాపాడిన గజ ఈతగాడు


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఈతగాడు ప్రసాద్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్న ఓ వృద్ధురాలని ఓ గజ ఈతగాడు కాపాడాడు. వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రికి చెందిన లక్ష్మి అనే వృద్ధురాలి కుమారుడు రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అంతేకాక ఆమెకూ గుండె సంబంధిత సమస్యతో బాధపడుతుండగా.. తన కుమారుడు మరణం తర్వాత తనను ఎవరూ పట్టించుకోవడం లేదని మనస్థాపంతో గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. ఈనేపథ్యాన శనివారం నదిలో దూకగా.. స్థానిక గజ ఈతగాడు ప్రసాద్ గమనించి వృద్ధురాలిని కాపాడాడు. తర్వాత ఆమె బాధను ఈతగాడితో పంచుకోగ ఆమెకు భోజనానికి కావాల్సిన నగదును అందజేశాడు.

మహిళా రెస్క్యూ టీమ్‌కు సర్టిఫికెట్ల ప్రదానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి చరిత్రలో తొలిసారిగా రెస్క్యూలో శిక్షణ పొందిన 13మందితో కూడిన మహిళా జట్టుకు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ హైదరాబాద్‌లో శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. జీఎం(రెస్క్యూ) శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, ఈడీ ఎస్‌డీ.సుభానీ తదితరులు అందజేశారు.

వార్డెన్ బాధ్యతల కోసం పోటాపోటీ

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసాని క్రీడా పాఠశాలలో వార్డెన్ బాధ్యతల కోసం పలువురు ఉపాధ్యాయులు పోటీ పడుతున్నారు. ఇందుకోసం రెండు గ్రూపులుగా విడిపోవడం చర్చనీయాంశంగా మారింది. స్కూల్ పునఃప్రారంభమయ్యాక శంకర్ వార్డెన్ విధులు నిర్వర్తిస్తుండగా, ఈనెల 3న వెంకటేశ్వర్లుకు హెచ్ఎం రామారావు అప్పగించారు. ఇదే బాధ్యతల కోసం పీడీ అంజయ్య పోటీ పడుతుండడంతో సమస్యను డీడీ దృష్టికి తీసుకవెళ్లారు. అయితే, ఈ ఏడాది వెంకటేశ్వర్లునే కొనసాగించాలని కొందరు ఉపాధ్యాయులు తీర్మానం చేసినట్లు సమాచారం. ఇంతలోనే రెగ్యులర్ హెచ్ఎం రామారావు సెలవులో వెళ్లగా ఇన్‌చార్జ్ బాధ్యతలు శంకర్‌కు అప్పగించారు.

రెండు పశువుల మృతి

చర్ల: మండలంలోని కుదునూరుకు చెందిన దొడ్డా వేమయ్యకు చెందిన రెండు ఆవులు, ఒక లేగదూడ శుక్రవారం మేతకు వెళ్లి సాయంత్రం రాలేదు. ఈక్రమాన రాత్రి సమయాన ప్రధాన రహదారిపై ఉండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈఘటనలో రెండు ఆవులు మృతి చెందగా, లేకదూడకు తీవ్ర గాయాలయ్యాయి. ఆవుల విలువ రూ.30వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్..

ఇద్దరిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఓ ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు పట్టుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై టి.యయాతిరాజు కథనం ప్రకారం.. అశ్వారావుపేటలోని రింగ్‌రోడ్డు సెంటర్‌లో తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో మండలంలోని నారాయణపురం వద్ద గల వాగు నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను నిలిపి తనిఖీ చేయగా.. ఎలాంటి అనుమతి పత్రాలు లేవని గుర్తించి మున్సిపాలిటీ పరిధిలోని వడ్డెరబజార్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కుంచాల ఏడుకొండలు, పేరాయిగూడేనికి చెందిన ట్రాక్టర్ యజమాని నార్లపాటి అశోక్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: ఓ యువ తి కనిపించకుండాపోయిన ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశా రు. ఎస్సై టి.యయాతిరాజు కథనం ప్రకారం.. మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన 18 ఏళ్ల యువతి ఈ నెల 3న రాత్రి తల్లిదండ్రులతో కలిసి ఇంట్లో నిద్రించింది. కాగా, తెల్ల వారుజాము సమయం నుంచి కనిపి ంచకుండాపోవడంతో కుటుంబీకులు తమ బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసిన ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం బాలిక తల్లి చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలిక ఆత్మహత్య ఘటనలో ఒకరి అరెస్టు

ఇల్లెందురూరల్: మండలంలోని మారుమూల గ్రామంలో జూన్ 27న ఓ మైనర్ బాలిక ఆత్మహత్య ఘటనపై ఓ మహిళను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొమరారం ఎస్సై నాగుల్‌మీరా కథనం ప్రకారం.. బాలిక ఆత్మహత్యపై అనుమానం ఉండడంతో ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు చేయగా.. చేసి విచారణ పార్వతి అనే మహిళను అరెస్టు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు ఆమెను ఖమ్మం జైలుకు తరలించినట్లు తెలిపారు.

అక్రమ కలప రవాణాపై ముమ్మర తనిఖీ..

ఇప్పటివరకు రూ.2.70 లక్షల టేకు దుంగలు స్వాధీనం


బొజ్జాయిగూడెం ప్రాంతంలో టేకు చెట్లు నరికివేసిన ఆనవాళ్లు

ఇల్లెందురూరల్: మండలలోని ఇల్లెందు రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో గత వారం రోజులుగా బొజ్జాయిగూడెం, కొత్తూరు పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా టేకు కలప తరలిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు రెండు రోజులుగా గాలింపు చర్యలు ముమ్మరం చేసి ఇప్పటివరకు రూ.2.70 లక్షలు విలువ చేసే 124 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు మరింత లోతుగా విచారణ నిర్వహిస్తే కలప అక్రమ తరలింపులో మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ విషయమై ఇల్లెందు రేంజ్ ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్ఓ చలపతిరావును వివరణ కోరగా.. టేకు కలప అక్రమంగా తరలిపోయినట్లు నిర్ధారించుకుని తనిఖీలు ప్రారంభించాం. ఇంకా తనిఖీలు కొనసాగించి అనుమానితులపై విచారణ కొనసాగిస్తాం.

మాజీ ఎమ్మెల్యే అనుచరుడిపై ఫిర్యాదు?

భద్రాచలంఅర్బన్: భద్రాచలం మాజీ తాజా ఎమ్మెల్యేల మధ్య జరుగుతున్న కోల్డ్ వార్ నేపథ్యాన శనివారం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య అనుచరుడిపై తాజా ఎమ్మెల్యే అనుచరుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం దుమ్ముగూడెం మండలంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో తాజా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే వీరయ్య చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ తాజా ఎమ్మెల్యే అనుచరుడు ఒకరు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టాడు. అయితే ఈ పోస్టును చూసిన మాజీ ఎమ్మెల్యే అనుచరుడు ఒకరు ఇలాంటి పెట్టడం సరైంది కాదని, మరోమారు పెడితే సహించేది లేదని హెచ్చరించాడు. దీంతో బస్టాండ్ ఎదురుగా ఇరువర్గాల వారు వాదోపవాదలు చేసుకున్నాక తాజా ఎమ్మెల్యే అనుచరుడు ఒకరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా తాజా, మాజీ ఎమ్మెల్యే అనుచరుల మధ్య జరుగుతున్నీ కోల్డ్ వార్ ఏ స్థాయికి చేరుతుందోనని వేచి చూస్తున్నారు.

ఆన్‌లైన్ మోసంపై..

ములకలపల్లి: ఆన్‌లైన్ ద్వారా అధికా ఆదాయం పొందాలనే తొందరలో ఓ యువకుడు రూ.2.66 లక్షల నష్టపోయిన ఘటన ఇంది. ఎస్సై కిన్నెర రాజశేఖర కథనం ప్రకారం.. మండలపరిధిలోని పొగళ్లపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు చదువు నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈక్రమంలో జూన్ 12న ఓ యాప్ ద్వారా పార్ట్‌టైం ఉద్యోగ ఉందని, 15 నిముషాలు పని చేస్తే రూ.800 సంపాదించవచ్చని ఉండడంతో నమ్మి ఒకరోజు పనిచేశాడు. అన్నట్లుగానే డబ్బులు రావడంతో తరువాత రూ.7 వేలు డిపాజిట్ చేయగా రూ.10వేలు వచ్చాయి. ఇలా యువకుడికి అధిక డబ్బులు ఇస్తామని చెప్పి పలు దఫాలుగా రూ.2.66 లక్షల డిపాజిట్ చేయించుకున్నారు. ఎన్నాళ్లకు డబ్బులు తిరిగి రాకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సైకు గోల్డ్ మెడల్


వరంగల్ పోలీస్ అధికారుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న స్వప్న

భద్రాచలంఅర్బన్: జోనల్ డ్యూటీ మీట్‌లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన భద్రాద్రి జోనల్ డ్యూటీ మీట్ ఈనెల 4న ముగిసింది. జోనల్ పరిధిలో వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని వరంగల్, మహబుబూబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు పలు విభాగాల్లో పోటీపడ్డారు. ఇందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 19 మెడల్స్ రాగా వీరిలో భద్రాచలం టౌన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న గంజి స్వప్నకు రెండు విభాగాలలో గోల్డ్ మెడల్ సాధించింది.

మూడు కేజీల గంజాయి స్వాధీనం

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని టౌన్ పోలీసులు పట్టుకున్నారు. బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులకు ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కన్పించడంతో విచారించారు. దీంతో సూర్యాపేటకు చెందిన ప్రేమ్‌చంద్ సీలేరులో గంజాయిని కొనుగోలు చేసి సూర్యాపేటకు తరలిస్తున్నట్లు తేలింది. పట్టుబడిన 3 కిలోల గంజాయి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని తెలిపి టౌన్ పోలీసులు ప్రేమ్ చంద్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పీరీల పండగకు వేళాయే..

- త్యాగానికి ప్రతీకగా మొహర్రం
- పండుగకు ముస్తాబైన పీరీలు
- కులమతాలకతీతంగా భక్తుల పూజలు

నేడు పీరీల పండుగ


రామవరం వేణుగోపాల్ టెంపుల్ ఏరియాలో ముస్తాబైన పీరీలు

కొత్తగూడెంటౌన్: న్యాయం, ధర్మం, సత్యం వంటి మానవీయ విలువలతో ప్రజాస్వామ్య పరిరక్షణకు యుద్ధం చేసిన హజ్రత్ ఇమామ్ హుస్సేన్, ఇమామ్ హుస్సేన్ త్యాగానికి ప్రతీకంగా జరుపుకునే పండగ మొహర్రం. ఈ పండగలో భాగంగా కులమతాలకు అతీతంగా పీర్ల పండుగను జరుపుకుంటారు. పండుగ నాడు భక్తులంతా పీరీలను వీధుల్లో ఊరేగిస్తుండగా.. భక్తులు కొబ్బరికాయలు, ఊద్‌లుతో మొక్కులు తీర్చుకుంటారు.

పీరీల ముస్తాబు..

పీర్ల పండుగను జరుపుకునేందుకు ఆదివారం ప్రజలంతా సిద్ధమయ్యారు. ఇందుకు అషూర్ ఖానాల్లోని పీర్లను ముస్తాబు చేసి పీరీలకొట్టంలో మానిక్‌లు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 76కు పైగా అషూర్ ఖానాలు ఉండగా.. కొత్తగూడెం సూపర్‌బజార్, రామవరంలోని మార్కెట్ ఏరియాలలో ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారు. పీర్ల పంజా(పీర్ల దేవుళ్ల ప్రతిమ)లను కూర్చోబెట్టి అమరవీరులను, పెద్దలను స్మరిస్తూ ఎర్రగా మండే నిప్పు కణికల్లో నడిచి తమ భక్తిని చాటుతారు.

తెల్లవారుజాము నుంచే సందడి

తెల్లవారు జామున పీరీలతో వీధుల్లోని ఇంటింటికి ఊరేగింపుగా తీసుకెళ్లగా.. భక్తులు కులమతాలకు అతీతంగా మొక్కి ఆశీర్వాదం తీసుకుంటారు. తిరిగి పండుగ రోజు సాయంకాలం వీటిని మార్కెట్లలో ఏర్పాటు చేయగా.. అందరూ అక్కడకు చేరుకుని ఆడిపాడి సందడి చేస్తారు. ఇందుకు దర్గాల్లో పీరీలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తారు. కాగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా అధికార యంత్రాంగం భద్రతా ఏర్పాట్లు చేసింది.

త్యాగానికి గుర్తు..



త్యాగాలకు గుర్తుగా మొహర్రం పండుగను జరుపుకుంటాం. పీర్లను ఊరేగింపుగా తీసుకొచ్చి భక్తులకు ఆశీర్వచనాలు, ఊద్‌లాంటివి అందిస్తాం. ఇస్లాంకు మూలమైన మానవతావాదానికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి. వీరత్వం నుంచి స్ఫూర్తి పొందిన పండగా..అన్ని వర్గాల ప్రజలు జరుపుకుంటారు.

– బాబా, అసూర్‌ఖానా నిర్వాహకుడు, వేణుగోపాల్‌నగర్‌కాలనీ, రామవరం

ఇస్లాం నూతన సంవత్సరం..



మహ్మద్‌ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్ వారి మనవడు సహచరుల ప్రాణత్యాగాలకు ప్రతీకగా మొహర్రంను జరుపుకుంటారు. కులమతాలకు అతీతంగా షరబత్ పంపిణీ, అన్నదాన కార్యక్రమాలను చేస్తారు. ఇది అన్ని వర్గాలకు ఇష్టమైన పండుగ.

– యాకుబ్‌పాషా, నూరియా హనఫీయా ఎడ్యుకేషనల్ సొసైటీ, పాల్వంచ